




మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కనిపించిన నెలవంక



మానుకోట కొత్త బజారులోని ఈద్గా వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, ముస్లిం మతపెద్దలు

నేడే ఈద్ ఉల్ ఫిత్ర్

- నమాజ్ కోసం ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
- ముగిసిన 30 రోజుల కఠిన ఉపవాస దీక్షలు

నెలవంక దర్శనంతో రంజాన్ సందడి

మహబూబాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గత నెల 11న నెలవంక దర్శనంతో 12వ తేదీ నుంచి ప్రారంభమైన రంజాన్ ఉపవాసాలు సమాప్తమయ్యాయి. బుధవారం వారం నెలవంక దర్శనంతో సుమారు 30రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలను పాటించిన ముస్లింలు గురువారం ఈద్‌ఉల్‌ఫిత్ర్ (రంజాన్)ను జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు అన్నిచోట్ల బుధవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల మధ్య నెలవంక దర్శనంతోనే మసీద్‌లలో సైరన్‌లు మోగించి గురువారం రంజాన్ పండుగను జరుపుకొంటున్నట్లు ప్రకటించారు. ఇక ఎండల తీవ్ర దృష్ట్యా ఉమ్మడి జిల్లాలోని వివిధ మసీద్‌లలో ఆయా ప్రాంతాలను బట్టి ఉదయం 8.30 నుంచి 9.30 వరకు నమాజ్‌లు జరుపుతుండగా.. ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల సమీపంలోని ఈద్గా మైదానంలో ఉదయం 9.30 గంటలకు, కంకరబోడ్‌లోని నూతన ఈద్గాలో కూడా 8.45 గంటలకు, తహసీల్దార్ కార్యాలయం వద్ద గల జామియ మసీద్ మహబూబియాలో ఉదయం 9.30 గంటలకు ఈదుల్ ఫిత్ర్ నమాజ్ ఉంటుందని ముస్లిం పెద్దలు ప్రకటించారు.

మత సామరస్యం, భక్తిభావం...

ముస్లింలు.. పవిత్ర మాసం రంజాన్ సందర్భంగా నెల రోజుల పాటు ఉపవాసాలు ఉండి పేదల ఆకలి గుర్తెరుగుతూ ఆపై రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు. మత సామరస్యానికి, భక్తి భావానికి ప్రతీకగా నిలిచే విశిష్టమైన శుభప్రదమైన రంజాన్ మాసానికి స్వాగతం పలకడానికి షాబాన్ మాసం నుంచే అన్ని విధాల ముస్లింలు సిద్ధపడి ఉంటారు. చంద్రదర్శనాన్ని బట్టి ఈ ఉపవాసాల మాసం 29 లేదంటే 30 రోజుల పాటు కొనసాగుతుంది. గతేడాది మాత్రం 29రోజుల ఉపవాస దీక్షలు కొనసాగగా.. ఈ ఏడాది ఏప్పట్లాగే 30 రోజుల ఉపవాసాలు జరిగాయి. ఈ రంజాన్ మాసానికి ఎంతో విశిష్టత ఉంది. 'రమ్జ్' అంటే అరబిక్ భాషలో 'కాలడం' అని అర్థంగా పెద్దలు విశ్లేషిస్తారు. ఈ 30 రోజుల ఉపవాస దీక్షలో శరీరాన్ని సుష్కింపజేయడం ద్వారా ఆత్మప్రక్షాళనతో సర్వపాపాలు సమసిపోతాయని ముస్లింల విశ్వాసం. ఆ క్రమంలోనే అరిషడ్వర్గాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అదుపులో ఉంటాయని.. దీనికి తోడు మనోనిగ్రహం కలుగుతుందని విశ్వసిస్తారు. మానవుడిలో ప్రేమాభిమానాలు, క్రమశిక్షణ, కర్తవ్యపరాయణత్వం, సహనం, దాతృత్వం, పవిత్ర జీవనం, న్యాయమార్గానుసరణం, ఆర్థిక సమానత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం తదితర ఉత్తమ గుణాలు ఆలవడుతాయని చెబుతారు. ఈ అలవాటు చేసేందుకు దేవుడైన అల్లాహ్ ప్రతీయేడు మానవ జాతికి రంజాన్ మాసాన్ని ప్రసాదించాడని ముస్లింలు భావిస్తారు.







ఆకలి బాధను గుర్తెరిగే రోజా..

రంజాన్ ఉపవాస దీక్షగా వ్యవహరించే 'రోజా'ను అరబిక్ భాషలో 'సామ్', 'సియామ్' అని అంటారు. సామ్ అంటే మానుకొనుట, ఆపుట, ఆగుట, కట్టుబడి ఉండుట అనే అర్థాలు వస్తాయి. ఉపవాసిని 'సాయిమ్' అని అంటారు. ఇస్లామియా పరిభాషలో ప్రభాత పూర్వ సమయం నుంచి సూర్యాస్తమయం వరకు అన్నపానియాలు త్యజించడం ఈ ఉపవాస దీక్షకు పరమార్థంగా పేర్కొంటారు. ఈ ఉపవాసదీక్షల వల్ల నిర్మలమైన, నిశ్చలమైన భక్తిభావం ఏర్పడడమే కాకుండా అకలి బాధతో అల్లాడే దీనజనుల కష్టాలను స్వయంగా ఉపవాస దీక్షల ద్వారా గుర్తించే అవకాశం లభిస్తుందని విశ్వసించి నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్నారు. ఆ క్రమంలోనే రోజూ ఐదు సార్లు దైవారాధన (నమాజ్) చేశారు. రాత్రి వేళల్లో తరావి నమాజ్‌లు చేశారు. అంతేకాకుండాపవిత్ర ఖురాన్ గ్రంథాన్ని పారాయణం చేసి, దాన్ని అర్థం చేసుకుని గురువారం (నేడు) రంజాన్ పండుగ జరుపుకుంటున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

- తాగునీరు అందించేందుకు వనరులను గుర్తించాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్, అదనపు కలెక్టర్లు, అధికారులు

మహబూబాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడిలేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తాగునీరు సరఫరా, పాఠశాలల మరమ్మతులు, సమ్మర్ యాక్షన్‌ప్లాన్, ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, డేవిడ్ సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. వీడియోకాన్ఫరెన్స్ అనంతరం, అధికారులతో అద్వైత్‌కుమార్‌సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించి, మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీరందించే వనరులను గుర్తించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటిని సరఫరా చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్నిఏర్పాట్లు చేయాలని, ఇప్పటికే ప్రారంభించిన సెంటర్లలో సెంటర్ల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎంఆర్ లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. సమస్యలను గుర్తించిన ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసరపనులు వచ్చే విద్యాసంవత్సరంలోపు పనులు పూర్తి చేయాలన్నారు. ఎండాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అవసరమైన విధంగా ప్రణాళిక ప్రకారం వైద్య, ఆరోగ్యశాఖ అందించాలని, సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు నరసింహరావు, అలువేలు, హరిప్రసాద్, జడ్పీ రమాదేవి, వెంకటేశ్వర్లు, రాజేందర్, అభిమాన్యుడు, కృష్ణవేణి, సుధాకర్, మరియన్న, కళావతిబాయి, కృష్ణారెడ్డి, సురేందర్, నరేష్‌రెడ్డి, రవీందర్, శాంతకుమార్ పాల్గొన్నారు.

మిర్చి ధర తగ్గిందని రైతుల ఆందోళన

- కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో నిలిచిన కాంటాలు
- అన్నదాతలు, వ్యాపారులతో అధికారుల చర్చలు
- మళ్లీ టెండరు హామీతో శాంతించిన కర్షకులు



కేసముద్రం మార్కెట్లో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కేసముద్రం, ఏప్రిల్ 10 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో బుధవారం మిర్చి ధర తగ్గిందని రైతులు ఆందోళనకు దిగారు. మార్కెట్‌కు బుధవారం 65 మంది రైతులు 416 బస్తాల్లో 58 క్వింటాళ్ల తేజ రకం మిర్చి తీసుకురాగా, 61 మంది రైతులు 76 బస్తాల్లో 22 క్వింటాళ్ల తాలురకం మిర్చి తీసుకువచ్చారు. ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలోని ఈ-వేలం ద్వారా తేజ రకం మిర్చి క్వింటాకు గరిష్ఠంగా రూ.15,568, కనిష్ఠంగా రూ.8,811, సగటున రూ.13,021 చొప్పున ధరలతో ఖరీదు చేశారు. ఈ-వేలంలోని విన్నర్ లీస్ట్ విడుదలైన ధరలను తెలుసుకున్న రైతులు తక్కువ రేట్లు వేశారని ఆరోపిస్తూ మార్కెట్ కార్యాలయాన్ని ముట్టడించారు. మిర్చి ధరను వ్యాపారులు కావాలనే తగ్గించారని మార్కెట్ అధికారుల ముందు రైతులు ఆరోపించారు. అధిక ధర పెట్టేంత వరకు ఇక్కడి నుంచి కదిలేదని లేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం మార్కెట్లలో మిర్చి రూ.19 వేలు, 20వేల దాగా ధర పలుకగా, ఇక్కడ మాత్రం వ్యాపారులు తగ్గించి రూ.12 వేలు, రూ.13వేలకే కొంటున్నారని ఆరోపించారు. నాణ్యమైన మిర్చికి సైతం తక్కువ ధరను నమోదు చేసి రైతులకు అన్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో రూరల్ సీఐ సర్వయ్య, పోలీసులు మార్కెట్‌కు చేరుకొని రైతులను శాంతింపజేశారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో డీఎంవో వెంకట్‌రెడ్డి, మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు, రైతుల నాయకులు, వ్యాపార ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ-నామ్‌లో అధిక ధర వచ్చే విధంగా మళ్లీ టెండరు నిర్వహిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ప్రారంభమైన రైతుల ఆందోళన సాయంత్రం 6 గంటలకు వరకు కొనసాగింది. ఫలితంగా మిర్చి కాంటాలు నిలిచిపోయాయి.

వ్యవసాయ మార్కెట్లకు నాలుగు రోజుల సెలవులు

నేటినుంచి మానుకోట, కేసముద్రంలో క్రయవిక్రయాలు బంద్

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 10 : మానుకోట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం (నేటి) నుంచి నాలుగు రోజులు సెలవులను ప్రకటించినట్లు కార్యదర్శి శంషీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11, 12న రంజాన్ పండుగ సందర్భంగా, 13, 14న శని, ఆదివారాలు వారాంతపు సెలవులుగా ప్రకటించినట్లు చెప్పారు. రైతు సోదరులు, వ్యాపారస్తులు, కూలీలు, దడువాయిలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. తిరిగి ఈనెల 15న సోమవారం నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరుగుతాయని తెలిపారు.

- కేసముద్రం : కేసముద్రం మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు ఉన్నట్లు ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు ప్రకటించారు. ఈనెల 11, 12 రంజాన్ పండుగ, 13, 14 శని, ఆదివారం సందర్భంగా సెలవులు ఉన్నట్లు తెలిపారు. రైతులు గమనించి ఈనెల 15న తమ సరుకులు మార్కెట్‌కు తీసుకురావాలని ఆయన సూచించారు.



మామిడితోటకు మందు పిచికారీ చేస్తున్న రైతు

- చీడపీడలు, తెగుళ్ల ప్రభావంతో ఆందోళన
- రెండేళ్లుగా నష్టపోతున్న రైతులు
- జిల్లా వ్యాప్తంగా 14,929 ఎకరాల్లో సాగు

మామిడి చేతికి వచ్చేనా..?!

చెట్లకు ఆలస్యంగా వచ్చిన పూత, రాలుతున్న పిందెలు



చెర్లపాలెంలో తేనెమంచుతో నల్లబడిన ఆకులు చూపిస్తున్న రైతు వాసురెడ్డి

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 10 : మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి వస్తుందో, రాదోనని దిగాలు పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో మామిడి చెట్లకు పూత ఆశాజనకంగా పూసినప్పటికీ, కాయచేతికి అంది వచ్చేలా లేదని మదనపడుతున్నారు. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలలోనే మామిడి పూతవచ్చి ఫిబ్రవరి, మార్చిలో పిందెలు పడి కొద్దిసైజ్ కాయలతో చెట్లు కళకళాడుతూండేవి. ఏప్రిల్ మాసం వచ్చినా ప్రస్తుతం ప్రతికూల వాతావరణ పరిస్థితులతో వచ్చిన పూతతో పిందె కనిపించకపోగా, కాసిన కొద్దిపాటి పిందెలు వాలిపోయి నేల రాలుతున్నాయి. కొన్నితోటల్లో పూతలు సకాలంలో వచ్చినా, మార్చి చివరి వరకు పొగమంచు (మూడం) చలి తీవ్రత హెచ్చుతగ్గులు, చీడపురుగుల ప్రభావం బాగా ఉండడంతో పూతకనిపించినంతగా పిందె కనిపించడం లేదు. ఏప్రిల్, మే మాసంలో పంటకోతకు రావాల్సి ఉండగా చీడ పురుగులు, తెగుళ్ల ప్రభావంతో పడిన కాస్తకాయలను కాపాడుకోవడానికి రైతులు ఇంకా మందులు పిచ్చికారి చేస్తూనే ఉన్నారు. అయితే ఏప్రిల్ చివరివారం నుంచి మేలో అధికంగా వడగాల్పులు వచ్చే అవకాశం ఉండంతో కాయలు రాలి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. తోటలను కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి మరి దారుణంగా ఉంది. కనీసం కౌలు కూడా పూడ్చలేని పరిస్థితిలో ఉన్నారు.

14,929 ఎకరాల్లో సాగు..

మహబూబాబాద్ జిల్లాలో మామిడి సాగుకు భూములు అనుకూలంగా ఉండటంతో ప్రస్తుతం 14, 929 ఎకరాల మామిడి తోట సాగులో ఉంది. ఇందులో ఎక్కువగా బంగినపల్లి, కేసర్, హిమాయత్ రకాల మామిడి తోటలను రైతులు పెంచుతున్నారు. ఇందులో కొంత స్వయంగా రైతులు సాగు చేస్తుంటే, అధికంగా కౌలు రైతులు సాగు చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం చీడ పురుగులు, తెగుళ్ల ఉధృత్తి అధికంగా ఉండటంతో నష్టాల బారినపడుతున్నారు. జిల్లాలో వివిధ మండలాల్లో సాగు చేస్తుండగా అధికంగా మరిపెడ మండలంలో 2,364 ఎకరాలు, అత్యల్పంగా గంగారంలో 18 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

- బయ్యారం 310 ఎకరాలు, గంగారం 18, గార్ల 1373, గూడూరు 145, కేసముద్రం 324, కొత్తగూడ 34, మహబూబాబాద్ 987, నెల్లికుదురు 715, చిన్నగూడూరు 206, దంతాలపల్లి 1,755, డోర్నకల్ 577, కురవి 2,360, మరిపెడ 2,364, నర్సింహులపేట 946, పెద్దవంగర 1,211, తొర్రూరు 1,601 ఎకరాల సాగు చేస్తున్నారు.

వెంటాడుతున్న నష్టాలు..

మామిడి రైతులను గత రెండేళ్లుగా నష్టాలు వెంటాడుతున్నాయి. గత సంవత్సరం ఆలస్యంగా మామిడిపూత వచ్చినప్పటికీ వడగండ్లవాన, ఈదు గాలులతో పూత, కాయలు అంతా నేలపాలైంది. దీంతో రైతులు లక్షల వరకు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది కొమ్మ కటింగ్ చేయడం, పాదులు తీయడం, దుక్కులు దున్నటం, ఎరువులు, మందులు పిచికారి వంటి సస్యరక్షణ చర్యలకు ఎకరాకు రూ.50 నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడులు పెట్టి పంట కోసం ఎదురు చూస్తున్నారు.

తేనే మంచు నివారణకు చర్యలు..

ప్రస్తుతం మామిడి తోటలకు తేనేమంచు, తామర పురుగు, పండు ఈగ వ్యాప్తితో పూత రాలడంతో పాటు ఆకులు నల్లబారి, మామిడి పిందెలు

మిగతా 8వ పేజీలో..

ఏడెకరాలకు రూ.8 లక్షల పెట్టుబడి
- కందగట్ల సత్తయ్య, కౌలురైతు



దంతాలపల్లి మండలం ఫత్తేపురం గ్రామంలో 7 ఎకరాల మామిడి తోటను కౌలుకు తీసుకున్నాను. ఈ ఏడాది బాగానే పూతపూసింది అనుకునేలోపు పడ్డాకాయపడినట్లుగానే రాలిపోతున్నాయి. దీంతో నెలలో మూడుసార్లు మందులు పిచ్చికారి చేస్తున్న వాతావరణ మార్పులతో నివారించలేకపోతున్నారు. ఇప్పటికే ఎకరాలకు రూ.70 వేల చొప్పున పెట్టుబడి పెట్టినాం. కాసిన కొద్దిపాటి కాయ చేతికి వచ్చే సమయంలో గాలులు వీస్తే నష్ట జరిగే అవకాశం ఉంది.

బుధవారం ఉష్ణోగ్రత	గరిష్ఠం : 36.5°C	కనిష్ఠం : 23.5°C

సమన్వయమే సవాల్!

- కావ్య.. తమ అవకాశాలకు గండి కొట్టారని నిర్వేదం
- శ్రీహరిపై 'గులాబీ ఫండ్' మరకలు
- రేవూరికి పార్లమెంటు బాధ్యతలపై పాత నేతల కినుక
- కొండా, నాయినిలను విస్మరించారని అనుచరుల అలక
- సీఎం రేవంత్‌రెడ్డి బుజ్జగించినా తగ్గని అసంతృప్తి

కాంగ్రెస్‌లో కడియంకు కలిసిరాని ఆశావహులు, దిగువ కేడర్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని' చందంగా మారింది కడియం శ్రీహరి కాంగ్రెస్ రాజకీయ ప్రయాణం. కాంగ్రెస్ అధిష్ఠానం ఫుల్ సపోర్టు చేస్తూ ఆయన కూతురికి వరంగల్ ఎంపీ టికెట్ ఇచ్చింది. కానీ, ఏ మాత్రం రాజకీయ అనుభవం లేని కావ్యను తమపై బలవంతంగా రుద్దారనే భావనలో ఉన్న కేడర్.. ఆమె రాకతో తమ అవకాశాలకు గండి పడిందని పలువురు ఆశావహులు తీవ్ర నిర్వేదంలో ఉన్నారు. అంతేకాదు ఎన్నో ఏళ్లుగా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌కు పెద్ద దిక్కుగా ఉంటున్న మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కాదని, ఎన్నికల ముందు పార్టీలో చేరిన పరకాల ఎమ్మెల్యేకు పార్లమెంట్ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వటంపై కూడా కేడర్ నారాజ్ అవుతోంది. మరోవైపు బీఆర్ఎస్ నుంచి ఫండ్ తీసుకుని కాంగ్రెస్‌లోకి జంప్ అయ్యారనే ఆరోపణలు కూడా కడియం శ్రీహరికి మచ్చలా మారుతున్నాయి. అయితే ఈ పరిణామాలను గమనించిన సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కడియంతో సయోధ్య కుదిర్చేందుకు చేసిన ప్రయత్నాలు అంతగా ఫలించలేదన్న చర్చ జరుగుతోంది. ఇన్ని పరిణామాల నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల వేళ కాంగ్రెస్ అధిష్ఠానానికి సమన్వయం ఓ సవాల్‌గా మారనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కావ్యతో కలవని క్యాడర్

కాంగ్రెస్ వరంగల్ ఎంపీ టికెట్ కోసం 42 మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో చాలా మంది కాంగ్రెస్ కోసం అనేక త్యాగాలు చేసిన వారు, పార్టీకి వీరవిధేయులు ఉన్నారు. కొందరైతే ఏకంగా తమ ప్రభుత్వ ఉద్యోగాలు కూడా వదులుకుని.. కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే ప్రధానంగా సీనియర్ నేతలు దొమ్మాటి సాంబయ్య, శనిగపురం ఇందిరలలో ఒకరికి టికెట్ దాదాపు ఖాయమనే ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ఖరారైన కడియం కావ్య తన తండ్రి స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్‌లో చేరటమే కాకుండా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జాక్‌పాట్ కొట్టేశారు. దీంతో కాంగ్రెస్ టికెట్‌పై ఆశలతో ఉన్న నేతలు, వారి అనుచరవర్గంలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని కావ్యను తమపై బలవంతంగా రుద్దారని కేడర్ మదనపడుతోంది. ఆయా ఏరియాల్లోని కాంగ్రెస్ వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో కడియం ఎపిసోడ్‌పై నిరసనలు వైరల్ అవుతున్నాయి.

కనీసం టికెట్ ఆశించిన ముఖ్య నేతలతో చర్చించకుండా ఏకపక్షంగా కావ్య పేరు ఖరారు చేయటంతో తామెందుకు సహకరించాలనే తిరుగుబాటు ధోరణి అటు నేతల్లోనూ, ఇటు కార్యకర్తల్లోనూ కనిపిస్తోంది. పేరుకు అభ్యర్థి కావ్య అయినప్పటికి బాధ్యతలు మొత్తం కడియం శ్రీహరి తన భుజస్కందాలపై వేసుకున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరి ఇళ్లకు వెళ్లి తన కూతురును ఆశీర్వదించాలని కోరుతున్నారు. కొందరు మొహమాటానికి సరే అని చెప్పిన, వెనుక మాత్రం ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కావ్యకు కొందరు ఎమ్మెల్యేలతో పాటు కేడర్ నుంచి పూర్తిస్థాయి సహకారం అనుమానమేనన్న ప్రచారం జరుగుతోంది.

సమన్వయం సాధ్యమేనా..?

లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో కాంగ్రెస్‌లో సమన్వయం ఓ సవాల్‌గా మారింది. కడియం కావ్య అభ్యర్థిత్వంపై కేడర్‌తో పాటు కొందరు ఎమ్మెల్యేల్లో ఉన్న అసంతృప్తిని తగ్గించడానికి కడియం శ్రీహరి సూచన మేరకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో ఓ సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో పాటు ఇద్దరు, ముగ్గురు టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు కూడా హాజరయ్యారు. కావ్యను గెలిపించాలని సీఎం చెప్పిన మాటలకు సరేనన్న నేతలు బయటకు వచ్చిన తర్వాత గెలుపు బాధ్యతలను తమ భుజస్కంధాలపై వేసుకునేందుకు ముందుకు రావటం లేదన్న చర్చ జరుగుతోంది. జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖను మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఎలాంటి బాధ్యతలు ఇవ్వకపోవటంతో కేడర్‌ను, లీడర్‌ను సమన్వయం చేసేది ఎవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన టీపీసీసీ కార్యదర్శి శనిగపురం ఇందిరా ఇప్పటికే కడియంకు సహకరించేది లేదంటూ ప్రకటనలు ఇస్తున్నారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి కొండా సురేఖ మెదక్ ఎంపీ స్థానంపై దృష్టిపెట్టి అటు వైపే ఎక్కువ ఫోకస్ చేస్తున్నారు. మిగతా నియోజకవర్గాల్లో కడియం సహకారం అంతంతే అనే చర్చ జరుగుతోంది. ఇక పాతికేళ్లకు పైగా రాజకీయాల్లో చక్రం తిప్పిన శ్రీహరి తన కుమార్తె రాజకీయ భవిష్యత్తు కోసం... తనపై పడిన గులాబీ ఫండ్ మరక ను చెరుపుకోవడంతో పాటు సొంత పార్టీలో అసంతృప్తులను సమన్వయం చేసుకోవడంలో ఏ మేరకు విజయవంతమవుతారన్న చర్చ జరుగుతోంది.

కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ ఫండ్ ఆరోపణలు..

తొలుత బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్య పేరును మార్చి 13న ఆ పార్టీ అధినేత ప్రకటించారు. దీంతో కడియం శ్రీహరి బీఆర్ఎస్ ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించటమే కాకుండా ప్రచారానికి కావాల్సిన ఏర్పాట్లను కూడా చేసుకున్నారు. ఈ క్రమంలోనే పార్టీ.. పార్లమెంట్ ఎన్నికలకు కావాల్సినంతా డబ్బులను ఫండ్ రూపంలో శ్రీహరికి అప్పగించిందనే ప్రచారం జరుగుతోంది. అయితే గులాబీ ఫండ్ చేతికి వచ్చిన తరువాతే కారు దిగు కాంగ్రెస్‌లో చేరారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు సరపడా ఫండ్ అంటే భారీ మొత్తంలోనే

మిగతా 7వ పేజీలో..

నేడు కేయూలో
పూలే జయంతి సంబురాలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10: మహాత్మజ్యోతిరావు పూలే 197వ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 11వ తేదీ ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ దూరవిద్య ప్రాంగణంలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వర్సిటీ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ విచ్చేస్తారని, అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి బోధన, బోధనేతర సిబ్బంది పరిశోధకులు,విద్యార్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై
పోలీసుల దాడులు


మహదేవపూర్‌లో ఓ ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 10: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పలువురు వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు బుధవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. లైసెన్సు లేకుండా ఫైనాన్స్ వ్యాపారం చేయడమే కాకుండా అధిక వడ్డీకి రుణాలు ఇస్తున్న వారి ఇళ్లను సోదాలు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో వేంనూరి వెంకటరెడ్డి, సూరారం గ్రామంలో నాగిళ్ల మనోజ్ కుమార్ ఇళ్లను తనిఖీ చేసి విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. లైసెన్సులు లేకుండా ఫైనాన్స్ దందా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

కాటారంలో..

కాటారం : అధిక వడ్డీలు, తనఖాలు పెట్టుకుని అప్పులు ఇచ్చే వారి ఇళ్లపై పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. మండల కేంద్రంలో కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు నేతృత్వంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు అభినవ్, నరేష్, మహేందర్, హరిశేఖర్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలుగా ఏర్పడి సోదాలు చేసి పలు విలువైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. అధిక వడ్డీలకు అప్పులిస్తున్న వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. వీరిలో పలువురిపై కేసులు నమోదు చేస్తునట్లు సీఐ నాగార్జునరావు తెలిపారు.

సమన్వయమే సవాల్!

(5వ పేజీ తరువాయి)

చేతులు మారాయనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై కడియం శ్రీహరి ఏప్రిల్ 2న వివరణ ఇచ్చారు. బీఆర్ఎస్ నుంచి ఒక్క రుపాయి ఫండ్ తీసుకున్నట్లు నిరూపించిన శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. అయినప్పటికి గులాబీ పార్టీతో పాటు కాంగ్రెస్‌లోనూ ఈ ఫండ్ విషయమై చర్చ జరుగుతోంది. ఏ పార్టీలోనైనా అభ్యర్థి ఖరారు కాగానే పార్టీ ఫండ్ ఇస్తారని, ఎన్నికల సమయంలో డబ్బులు తీసుకెళ్లటం సాధ్యం కాదు కాబట్టి ముందుగానే ఇస్తారనే చర్చ జరుగుతోంది. కావ్యకు టికెట్ మార్చి 13న బీఆర్ఎస్ టికెట్ ఖరారవగా.. ఆమె 27వ తేదీన రాజీనామా చేశారు. అంటే ఈ రెండు వారాలు బీఆర్ఎస్‌లో కడియం ఎపిసోడ్ ఏం జరిగిందనే చర్చ అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌లో జరుగుతుంది. రాజకీయాల్లో నీతి, నిజాయితీ పరుడిగా పేరున్న కడియంపై గులాబీఫండ్ ఆరోపణలు ఓ మరకలా మారిందనే చర్చ జరుగుతోంది.

రేవూరికి బాధ్యతలపై కేడర్ నారాజ్..


పుండు మీద కారం చల్లినట్లుగా అధిష్ఠానం వ్యవహారం కేడర్‌ను మరింతగా రెచ్చగొడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొదట్లో వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా మంత్రి కొండా సురేఖ వ్యవహరించారు. అయితే కడియం కావ్య కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపిక కాగానే. సురేఖ స్థానంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. దీంతో కేడర్‌లో పాత మిత్రులంతా ఒక్కటవుతున్నారనే సంకేతాలు వెళ్తున్నాయనే చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు నెలపదిహేను రోజుల ముందే బీజేపీ నుంచి ప్రకాశ్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరి.. అనూహ్యంగా పరకాల ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాజకీయాల్లో సీనియర్ నేతే అయినప్పటికి కాంగ్రెస్ రాజకీయాల్లో కేవలం 4నెలల అనుభవం మాత్రమే ఉంది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, జిల్లాల విభజన తరువాత సుదీర్ఘకాలంగా వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల అధ్యక్షుడిగా పని చేయటంతో పాటు క్యాడర్‌తో సత్సంబంధాలు ఉన్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి లేదంటే మంత్రి కొండా సురేఖనే వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమించకుండా రేవూరిని నియమించడంపై కేడర్ నారాజ్ అవుతోంది. ఇదే సమయంలో గతంలో టీడీపీ పని చేసిన వారికే పెద్దపీట వేస్తున్నారనే ఆందోళనను పాత కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తున్నారు. వయస్సు రీత్యా ఆయనకు ప్రస్తుత రాజకీయాల్లో దూకుడుగా వ్యవహరించే పరిస్థితి లేదని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. ఇప్పటికే కడియం శ్రీహరి కుమార్తెను బలవంతంగా తమపై రుద్దారనే భావనలో ఉన్న కేడర్.. పార్లమెంట్ బాధ్యతలు కూడా పాత కాంగ్రెస్ నేతలకు ఇవ్వకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నట్టు సమాచారం.

ఏనుమాముల మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 10: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం, శుక్రవారం రంజాన్ సందర్భంగా సెలవు, శనివారం వారాంతపు యార్డు బంద్ సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉంటుందన్నారు. మార్కెట్‌లో సోమవారం నుంచి యథావిధిగా సరుకుల క్రయవిక్రయాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ విషయాన్ని రైతులు, వ్యాపారులు, కార్మికులు గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని ఆయన కోరారు.

హెల్త్ ఇన్సూరెన్స్ పేరుతో నయా మోసం

ఏజెంట్లతో కుమ్మక్కై ఓ ప్రైవేటు ఆస్పత్రి కక్కుర్తి ● 18నెలల్లో రూ.2.67లక్షల స్వాహా



వరంగల్ మెడికల్, ఏప్రిల్ 10: హనుమకొండ బాలసముద్రం ప్రాంతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి ప్రయివేట్ ఇన్సూరెన్స్ సొమ్ములను కాజేసేందుకు తప్పుడు మార్గాలను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. 18 నెలల కాలంలో రూ. 2.67లక్షలు కొల్లగొట్టినట్లు సమాచారం. సూపర్ స్పెషాలిటీ వైద్యులు లేకున్నప్పటికీ వారి పేర్లను ఉపయోగిస్తూ ఆపరేషన్లు చేసినట్లు రికార్డులు సృష్టించి భారీ మొత్తంలో నిధులు స్వాహా చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

రూ.67లక్షలు స్వాహా

బాలసముద్రంలోని ఈ ఆస్పత్రికి కేవలం 50 పడకలు మాత్రమే ఉన్నాయి. ఈ పడకల్లో 18-07-2022 నుంచి 31-03-2023 వరకు 143 క్లెయిమ్స్‌లో రూ. 67 లక్షలు కొల్లగొట్టినట్లు సమాచారం. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో రూ. 2 కోట్లను స్వాహా చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. ఈ ఆస్పత్రికి 27 వివిధ రకాల ఇన్సూరెన్స్‌లు అనుసంధానమై ఉన్నాయి. వీటిలో ప్రధానంగా ఒక ఇన్సూరెన్స్ నుంచే ఇన్ని కొల్లగొట్టినట్లుగా మరో ఐదు ఇన్సూరెన్స్‌ల కంపెనీ నుంచి ఇంకెన్ని దిగమింగారో లెక్కలు తేలాల్సి ఉంది.

ఏజెంట్ల మాయ

ఇన్సూరెన్స్ డబ్బుల కోసం సదరు ఆస్పత్రి ఏజెంట్లను మచ్చిక చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు ఒక రోగికి అయిన బిల్లుల్లో 20శాతం కమిషన్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఒక ఇంట్లో ఒకరి పేరు మీద ఆరోగ్య బీమా ఉంటే అదేఇంట్లోకి మరొక వ్యక్తికి ఏదైనా ఆరోగ్య సమస్యవస్తే ఆరోగ్య బీమా ఉన్న వ్యక్తి పేరుతో ఇక్కడ చికిత్స అందిస్తారు. ఈరకంగా ఆరోగ్య బీమా కంపెనీలను బురిడీ కొట్టిస్తున్నారు. ఇందుకు ఏజెంట్లు కూడా సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ఓ రోగికి ఏదైనా ఆపరేషన్ చేయాలంటే ఇన్సూరెన్స్ కంపెనీలు ప్యాకేజీలు నిర్ణయిస్తాయి. అంతకంటే ఎక్కువ ఖర్చు అయితే కోపేమెంట్‌గా ఆస్పత్రి యాజమాన్యాలు డబ్బులు స్వీకరిస్తాయి. చికిత్స పొందిన రోగి డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొందరు ఇన్సూరెన్స్ ఏజెంట్లు బాలసముద్రంలోని ఆస్పత్రితో కుమ్మక్కై ఎలాంటి కోపేమెంట్ లేవని రోగులను ఇక్కడికి పురమాయిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతీ రోగికి ఓపెన్ బిల్లే..

ఇన్సూరెన్స్ ప్రకారం ఏదైనా రోగికి చికిత్స అందిస్తే ఐదు రోజులు ఆస్పత్రిలో ఉంటే ఓపెన్ బిల్ విధానం అమలులో ఉంది. ఈ విధానం ప్రకారం ఎంత బిల్ అయినా క్లెయిమ్ చేయవచ్చు. ఈ నిబంధనలు ఆసరాగా తీసుకొని చక్రం తిప్పుతున్న ఓ ఆస్పత్రి అవసరం లేని రోగులను కూడా ఐసీయూ, కార్డియాక్, ఎమర్జెన్సీ విభాగాల్లో రోజులకొద్ది ఉంచుకొని ఓపెన్ బిల్లింగ్ విధానం ద్వారా బీమా క్లెయిమ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా రోగి ఒక పేరు మీద ఉంటే మరో రోగి పేరుతో చికిత్స అందిస్తున్నట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి.

సీబీసీఐడీ విచారణకు డిమాండ్

నగరంలో 250 పడకల ఆస్పత్రిలు చాలా ఉన్నాయి. పైగా ఇవి చాలా సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్నాయి. ఇలాంటి ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ సేవలు అన్ని సిద్ధంగా ఉన్నాయి. వీటి క్లెయిమ్స్ కూడా లక్షలు దాటడం లేదు. అయితే హనుమకొండ బాలసముద్రంలోని 50 పడకల ఆస్పత్రిలో కేవలం 18 నెలల కాలంలో రూ. 2.67 కోట్ల క్లెయిమ్స్ కేవలం ఒకే సంస్థ ద్వారా జరగడం పట్ల వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మిగతా 27 ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా ఇంకెన్ని జరిగాయోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మొత్తం ఈ లావాదేవీలపై సీబీఐచే విచారణ జరిపించాలనే డిమాండ్ వ్యక్తం అవుతోంది.

ధార్మిక భవన్‌లోకి వేద పాఠశాల

● కలెక్టర్ ఆదేశాలతో ఎట్టకేలకు దిగివచ్చిన దేవాదాయ శాఖ అధికారులు ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హనుమకొండ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవాలయం ప్రాంగణంలో ఉన్న వేద పాఠశాలలను ధార్మిక భవన్‌లోకి తరలించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఎట్టకేలకు అంగీకరించారు. ధార్మిక భవన్‌లో పాఠశాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పక్షం రోజుల్లో పాఠశాలను భవన్‌లోకి తరలించనున్నారు. భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శేషభారతి ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో అధికారికంగా తెలిపారు. ధార్మిక భవనంలో వేద విద్యార్థుల నివాసం కోసం మొదటి అంతస్తును, తరగతి గదుల నిర్వహణకు నాలుగో అంతస్తును కేటాయించనున్నట్టు తెలిపారు. ధార్మిక భవన్‌లో వేద పాఠశాల నిర్వహణకు, విద్యార్థుల నివాసానికి అవసరమైన వసతుల కల్పనకు పనులు జరుగుతున్నాయని తెలిపారు.


వేద పాఠశాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

ఎట్టకేకు దిగివచ్చి..

భద్రకాళి ఆలయం చుట్టూర మాడవీధుల నిర్మాణం జరుగుతున్న క్రమంలో వేద పాఠశాలను ధార్మిక భవనంలోకి మార్చాలన్న ప్రతిపాదనను దేవాదాయ శాఖ అధికారులు మొదట నిరాకరించారు. ఘోషిస్తున్న వేద పాఠశాల శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్త వచ్చిన సంగతి తెలిసిందే. దీనితో ఈ విషయం కలెక్టర్ సిక్తా పట్నాయక్, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి వెళ్లింది. మంత్రి కలెక్టర్ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను పిలిపించుకొని మాట్లాడారు. వేద పాఠశాలను ధార్మిక భవన్‌లోకి తరలించాలని ఆదేశించినట్టు తెలిసింది. దీనితో దేవాదాయ శాఖ అధికారులు వేద పాఠశాలకు ధార్మిక భవన్‌లో చోటు కల్పించేందుకు సమ్మతించారు.

వేరు వేరు అంతస్తుల్లో...:

ధార్మిక భవనంలోని మొదటి అంతస్తును, నాలుగో అంతస్తును వేదపాఠశాలకు కేటాయించాలని నిర్ణయించారు. కింద అంతస్తులో విద్యార్థులు ఉండడానికి డార్మెటరీలను ఏర్పాటు చేస్తారు. వారికి అవసరమైన భోజనాల కోసం కిచెన్‌ను కిందనే ఏర్పాటు చేయనున్నారు. పైన నాలుగో అంతస్తులో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తారు. వేద పాఠశాలకు విద్యార్థుల సంరక్షణను చూసేందుకు ప్రస్తుతం ఒక కేర్ టేకర్ కూడా ఉన్నారు. అయన కుటుంబంతో సహా పాఠశాలలోనే నివాసముంటున్నందువల్ల ధార్మిక భవన్‌లో కూడా అయనకు ప్రత్యేకంగా ఒక గదిని కూడా కేటాయించాల్సి ఉంది. పాఠశాలకు సంబంధించిన వస్తువులు, పుస్తకాలు, ఇతర బోధనా సామగ్రిని భద్రపరచడానికి ప్రత్యేకంగా మరో గది (స్టోర్ రూం)ను కూడా ఏర్పాటు చేయాల్సి ఉందని పాఠశాల నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం..

వేద పాఠశాల నిర్వహణలో ఎలాంటి అసౌకర్యాలు లేవని, దేవాదాయ శాఖ సౌజన్యంతో పాఠశాల నిర్వహణకు అన్ని రకాల సహకారం అందిస్తున్నామని శ్రీ భద్రకాళి దేవస్థానం ఈవో శేషభారతి తెలిపారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'ఘోషిస్తున్న వేదపాఠశాల' శీర్షికతో వచ్చిన వార్తకు స్పందించారు. ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేశారు. ధార్మిక భవనంలో కేటాయించిన స్థలం వేద పాఠశాల నిర్వహణకు, విద్యార్థుల నివాసానికి అనుకూలంగా ఉంటుందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని శ్రీ భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శేషభారతి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నిరుద్యోగ యువతులకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, ఏప్రిల్ 10 : భారతీయ స్టేట్ బ్యాంక్-గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, టైలరింగ్‌లో 30 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ మాధురి తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు 18 నుంచి 45 యేళ్ల లోపు ఉండి, తెలుగులో చదవడం, రాయడం వచ్చి, తెలుపు రేషన్ కార్డును కలిగి ఉండాలన్నారు. చదువు కొనసాగిస్తున్న విద్యార్థులు, మునిసిపాలిటీకి చెందిన వారు అర్హులు కాదన్నారు. శిక్షణ ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతుందన్నారు. శిక్షణకాలంలో అభ్యర్థులకు ఉచిత వసతితో పాటు భోజనం ఉంటుందని, శిక్షణ కాలంలో కోర్స్‌కు సంబంధించిన మెటీరియల్ కూడా ఉచితంగా అంచనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హతల జిరాక్స్ కాపీలతో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి సంస్కృతీ విహార్‌లో గల ఎస్‌బీఐ ఆర్ఎస్ఈటీఐ నందు ఈ నెల 14 లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 97040 56522, 98493 07873, 62812 60878, 99491 08934 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

మే 6 నుంచి డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 10: కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ బీఏ, బీకామ్, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల 2, 4, 6వ సెమిస్టర్ పరీక్షలు మే 6 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం. తిరుమలదేవి షెడ్యూల్‌ను బుధవారం విడుదల చేశారు. రెండో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25 తేదీల్లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకు అలాగే నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 24, 27తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. 6వ సెమిస్టర్ పరీక్షలు 7, 9, 15, 17, 20, 22, 24,27 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. వీటితో పాటు బీసీఏ, బీ వొకేషనల్, బీహెచ్ఎం-సీటీ, వీడీసీ సెమిస్టర్ కోర్సుల పరీక్షలను కూడా నిర్వహిస్తామని షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

డీసీసీ ఎస్టీ సెల్ చైర్మన్‌గా రవీంద్రనాయక్

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 10: కాంగ్రెస్ కమిటీ వరంగల్ జిల్లా ఎస్టీ విభాగం చైర్మన్‌గా సంగెం మండలం పెద్దతండాకు చెందిన గుగులోతు రవీంద్రనాయక్ నియమితులయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం మేరకు టీపీసీసీ ఎస్టీ విభాగం చైర్మన్ డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ జిల్లాలో ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రవీంద్రనాయక్ పేర్కొన్నారు.



ఉత్తమ పౌర పురస్కారాలు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

గురుధామంలో ఉగాది ఉత్తమ పౌర పురస్కారాలు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 10: గ్రేటర్ వరంగల్ మూడవ డివిజన్ పైడిపెల్లిలోని గురుధామంలో(సప్తధామ్) ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పలువురికి ఉత్తమ పౌర పురస్కారాలు అందజేశారు. శివానందగురు కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ముగ్గురికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఏటూరునాగారంకు చెందిన డాక్టర్ బండ్ల వరప్రసాద్, కూచిపూడి నాట్యాచార్యులు బొంపెల్లి సుధీర్‌రావు, హనుమకొండకు చెందిన ట్రైనీ కలెక్టర్ శ్రీసాయి ఆశ్రిత్‌కు రూ.5వేల నగదు, మెమెంటో అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హైదరాబాద్ విజిలెన్స్ ఏసీపీ శ్రీనివాసరావు, శివానందగురు కల్చరల్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్, గండ్లూరి రాజశేఖర్, బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు, పబ్బ విశ్వేశ్వర్, వెంకటరమణ, సుదర్శన్‌రావు, స్వామి, కృష్ణచైతన్య, ఆనంద్, రాంరెడ్డి, ప్రియాంక, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర కరపత్రం ఆవిష్కరణ

కాజీపేట, ఏప్రిల్ 10: యువతలో దేశభక్తి, జాతీయభావం పెంచి హిందువుల ఏకీకరణ చేయడం కోసం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ పని చేస్తున్నాయని వీహెచ్‌పీ వరంగల్ మహానగర్ కార్యదర్శి శ్రీరామ్ ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ నెల 23న విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించనున్న వీర హనుమాన్ కరపత్రాల పోస్టర్‌ను బుధవారం కాజీపేటలోని మీడియా పాయింట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న వీర హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీలో భాగంగా ఈ నెల 23న రంగశాయిపేట మహంకాళి దేవాలయం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతున్నట్టు తెలిపారు. అక్కడి నుంచి కరీమాబాద్, వరంగల్ చౌరస్తా మీదుగా పద్మాక్షి దేవాలయం హనుమత్‌గిరి వరకు యాత్ర సాగుతుందన్నారు. హిందూ ధర్మప్రచారకులు రాధా మనోహర్ ఈ శోభాయాత్రకు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. శోభాయాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొల్లూరి ఆదిత్యసాయి, దార ధనుంజయ్, అరవింద్, వినయ్, అరుణ్, విజయ్, లక్ష్మణ్, నాగార్జున, సిద్దూ తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉదయ్ కుమార్

ఆర్‌వోబీపై లారీ ఢీకొని వ్యక్తి మృతి

మడికొండ, ఏప్రిల్ 10 : లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కాజీపేట మండలం కడిపికొండ రైల్వే ఓవర్ బ్రిడ్జిపై చోటు చేసుకుంది. తెల్లవారితే రంజాన్ పండుగ ఉండగా రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందడంతో ఓ కుటుంబంలో విషాదం నెలకొంది. మడికొండ ఎస్సై రాజబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండకు చెందిన ఎమ్డీ బషీరుద్దీన్(60) బుధవారం కడిపికొండ నుంచి బైక్‌పై కాజీపేటకు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఆర్‌వోబీ పైకి రాగానే లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బషీరుద్దీన్ కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బషీరుద్దీన్ భార్య, బంధువులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా, మృతుడికి భార్య మాత్రమే ఉందని ఎస్సై రాజబాబు పేర్కొన్నారు.


మృతిచెందిన బషీరుద్దీన్

మండే ఎండలో విధులా?

- మధ్యాహ్నం 1గంట వరకు పారిశుధ్య సిబ్బందికి పనులు
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్
- అసహనం వ్యక్తం చేస్తున్న కార్మికులు
- పునరాలోచించాలని వేడుకోలు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 10: భానుడు నిప్పులు కురిపిస్తున్నాయి. ఉదయం 8గంటలకే ఎండలు దంచికొడుతున్నాయి. ఈ ఎండలో బయటకు వెళ్లి రావాలంటేనే జనం భయపడుతున్నారు. అయితే బల్దియా పారిశుధ్య కార్మికులు మాత్రం మధ్యాహ్నం 1గంట వరకు పనిచేయాలని ఉన్నతాధికారులు హుకుం జారీ చేస్తున్నారు. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బల్దియా పరిధిలో పారిశుధ్య పనులు చేసే సిబ్బంది ఇకపై ఒక్క పూట విధులు నిర్వర్తించాలని తెలిపారు. వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా గురువారం నుంచి ఎండాకాలం ముగిసే వరకు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. సిబ్బంది వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు నిబంధనలు పాటించాలని తెలిపారు.


తెల్లవారుజామున విధులకు వస్తున్న పారిశుధ్య కార్మికులు(ఫైల్)

గతంలో ఇలా..

యేటా జూన్ నుంచి మార్చి వరకు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పారిశుధ్య కార్మికులు పనులు నిర్వహిస్తారు. కానీ ఎండాకాలంలో సిబ్బంది పడే ఇబ్బందిని గుర్తించి ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఉదయం 5 నుంచి 11.30 గంటల వరకు అధికారులు విధులు కేటాయిస్తారు. వేసవికాలంలో ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో పూర్తిగా ఒక్క పూట మాత్రమే పని కల్పించాలనే నిబంధన ఉంది. గత మున్సిపల్ కమిషనర్, పాలక వర్గం ఉదయం 11గంటల వరకే పారిశుధ్య కార్మికులతో పనిచేయించేవారు. కానీ ప్రస్తుత కమిషనర్ అందుకు విరుద్ధంగా మధ్యాహ్నం 1గంట వరకు పని చేయాలని సూచించడంతో చాలామంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మండేఎండలో ఎలా పనిచేయాలని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల అసహనం


వరంగల్ మహానగర పరిధిలోని డివిజన్లలో పారిశుధ్య కార్మికులు కాలనీలలో తిరుగుతూ చెత్త సేకరించడం నుంచి మొదలుకొని రోడ్లు ఊడ్చడం, డ్రైనేజీలు శుభ్రం చేయడం చేస్తుంటారు. ఈ వేసవిలో కమిషనర్ ఉదయం 5గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విధులు నిర్వర్తించాలని ఆదేశించింది. నగరానికి సుమారు 20, 30 కిలోమీటర్ల దూరం నుంచి ఉదయం 4 గంటలకు వచ్చి 5 గంటలకు బయోమెట్రిక్ ద్వారా హాజరు వేసుకుని 1 గంటవరకు ఎండలో విధులు నిర్వర్తించాలంటే చాలాకష్టంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క పూట అన్నట్టే గానీ.. ఎండలో పని చేయడం, భోజనహారాలు లేకుండా విధులు నిర్వర్తించడంవల్ల స్పృహతప్పి ప్రాణాలు పోయే పరిస్థితి ఉంటుందంటున్నారు. ఇళ్ల యజమానులు కనీసం మంచి నీళ్ల కూడా ఇవ్వరని వాపోతున్నారు. అయితే గతంలో మాదిరిగా ఎండాకాలంలో ఉదయం 5 నుంచి 11.30 వరకు విధులు కేటాయించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కమిషనర్, పాలక మండలి, అధికారులు పునరాలోచించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే నిరసన, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నారు.

సంఘాలు, నాయకుల జాడెక్కడ?

బల్దియా కార్మికుల సమస్యలే మా సమస్యలు.. కార్మికుల కష్టాలే మా కన్నీళ్లు.. అని గొప్పలు చెప్పుకునే కార్మిక సంఘాలు, జేఏసీ నాయకులు ఎక్కడ అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కమిషనర్ నిర్ణయంపై ఏ సంఘం నాయకుడు స్పందించకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. పారిశుధ్య కార్మికుల నుంచి సంవత్సర చందాలు, సభ్యత్వాలు, సభలు, సమావేశాలు, ఎల్ఐసీల పేరుతో క్రమం తప్పకుండా డబ్బులు వసూలు చేసే కొన్ని సంఘాల నాయకులు అడ్రస్ లేకుండా పోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అన్ని సంఘాలు, జేఏసీ ఒక్కటై శానిటేషన్ సిబ్బంది పని వేళల్లో మార్పు వచ్చే విధంగా చూడాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

పని గంటలు తగ్గించాలి

బొట్ల భిక్షపతి మాదిగ, టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు



పారిశుధ్య కార్మికులు ఎండలో పని చేయాలంటే చాలా కష్టం. ఎండాకాలంలో కార్మికులు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో ఉదయం 5 గంటల నుంచి 11.30 గంటల వరకు మాత్రమే పని చేయించేవారు. కానీ ప్రస్తుత బల్దియా కమిషనర్ 1గంట వరకు పనిచేయాలని ఆదేశించడం సరికాదు. కమిషనర్ పునరాలోచించి పని గంటలు తగ్గించాలి. లేదంటే కార్మికుల పక్షాన కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతాం.

మొక్కల పెంపకంపై శ్రద్ధ వహించాలి

• ఎంపీడీవో వేణుమాధవ్

పెద్దవంగర, ఏప్రిల్ 10 : నర్సరీల్లో పెంచే మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో బి.వేణుమాధవ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ, పల్లె ప్రకృతివనాలు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ పట్ల అలసత్వం వహించవద్దని సూచించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన సమాజం తయారవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, సత్వరమే పూర్తి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'పాఠశాలల్లో మౌలిక వసతులు'

తొర్రూరు, ఏప్రిల్ 10 : తొర్రూరు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఎంపీడీవో సిలార్‌సాహెబ్ అన్నారు. బుధవారం తొర్రూరులోని ఎంపీడీవో కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఎం. బుచ్చయ్య, నళిని, ఏపీఎం సంజీవరావు, అరుణ్ తేజ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాగు నీటి కోసం రైతన్న అరిగోస



ఎండిపోతున్న వరి పంటను చూపుతున్న మహిళా రైతు

• చిన్నగూడూరులో ఎండుతున్న వరి పంట

• ఆందోళనలో అన్నదాతలు

చిన్నగూడూరు, ఏప్రిల్ 10 : రోజురోజుకి భానుడి ప్రతాపం పెరుగుతోండటంతో భూగర్భజలాలు అడుగంటి, వరి సాగుకు నీటి సమస్య తీవ్రమైంది. బావులు, చెరువులు వాగులు ఎండిపోయాయి. యాసంగి వరి చివరి దశలో నీటిని అందించేందుకు రైతన్నలు విలవిల లాడుతున్నారు. ఓ వైపు సాగునీరు లేక ఆందోళనలో ఉన్న అన్నదాతకు తెగుళ్లపీడ తోడైంది. వాటి బారి నుంచి వరిపంట చేతికందుతుందా అన్న ఆందోళన అన్నదాతను వెంటాడుతోంది.

ఎండుతున్న పంటలు..

చిన్నగూడూరు మండల వ్యాప్తంగా యాసంగిలో 3,010 ఎకరాల్లో వరిసాగు చేశారు. మరికొంత మంది రైతులు ఆరుతడి పంటలు వేశారు. ఆకేరు వాగు ఆధారంగా ఉగ్గంపల్లి, విస్సంపల్లి, జయ్యారం, మన్నెగూడెం గ్రామాల్లో 1,200 ఎకరాల్లో రైతులు వరిపంట వేశారు. ఆకేరు ఎండి ఎడారిగా మారింది. చెరువులు నెర్రలు బాసినవి. దీంతో నెల రోజులుగా రైతులు తమ పంటకు నీరు అందించేందుకు భగీరథ ప్రయత్నాలు చేసినా, వేలకు వెల రూపాయలను వెచ్చించి, ఆకేరులో జేసీబీల సహాయంతో బావులు పూడికలు తీసినప్పటికీ భూగర్భ జలం లేకపోవడంతో ఫలితంలేకుండా పోయిందని రైతులు దిగులు చెందుతున్నారు. గత ఏడాదిలో నీరు పుష్కలంగా ఉన్న ఆకేరు, ఈసారి ఎండిపోవడంతో అధికారులను వేడుకున్నా నీరు విడుదల చేయకపోవడంతో తమ పంటలు ఎండిపోయాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోత దశలో తెల్లకంకులు..

మండలంలో సాగు చేసిన వరి పంటకు కాండం తొలుచు పురుగు సోకి ధాన్యం తెల్లకంకులుగా మారుతోంది. ఫలితంగా గింజలు తాలుగా మారి, దిగుబడి తగ్గుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో కాండం తొలుచు, నల్లితెగులు సోకి వరితెలుపు రంగులోకి మారి సుడి తిరిగిపోతుంది. నివారణకు రైతులు ఎన్ని మందులు కొట్టినా తెగులు అదుపుకాక పంటంతా బూడిద రంగులోకి మారి వరి కంకులు కుళ్లిపోతున్నాయి. తెగుళ్ల తొలిదశలో మందులు పిచికారి చేసినా లాభం లేకుండాపోయిందని, పెట్టుబడి పెట్టిపంట సాగుచేస్తే గడ్డి మాత్రమే మిగులుతుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.



సాగునీటి కోసం పూడికతీస్తున్న రైతులు

తెగుళ్లతో చేతికి వచ్చిన పంట నాశనం..

- అంగోతు జగన్ ఉగ్గంపల్లి రైతు



నాలుగు ఎకరాల్లో వరిపంట వేశాను. ఆకేరు ఎండిపోయి నీరందక రెండెకరాలు ఎండిపోయింది. ఉన్న కాస్త పంటకు తెల్ల కంకి రోగం తగిలి పంట అంతతాలే. ఎకరానికి రూ.22వేల వరకు పెట్టుబడి పెట్టాను. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు. ఎండిపోయిన పొలాలకు నష్ట పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

• షీ టీం ఎస్సై సునంద



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న సునంద

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 : అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మహబూబాబాద్ షీ టీం ఎస్సై సునంద అన్నారు. కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా ఎస్పీ సుదీర్‌రామ్ నాద్ కేకన్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ చెన్నయ్య ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్‌నేరాలు, అపరిచితుల ఫోన్ కాల్స్ పట్ల అవగాహన కలిగిఉండాలని విద్యార్థినులకు సూచించారు. అపరిచిత వ్యక్తులు, అపరిచిత గ్రూపుల నుంచి వచ్చిన లింక్‌లను ప్రెస్ చేయవద్దని సూచించారు. మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు ఏదైనా సమస్య వచ్చినపుడు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీ-సాట్ యాప్‌ను ప్రతీ మహిళ ఉపయోగించుకోవాలన్నారు. 'గుడ్ టచ్-బ్యాడ్‌టచ్'పై అవగాహన కలిగిఉండాలన్నారు. విద్యార్థినులు పౌష్టిక ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని డాక్టర్ కల్లెం జ్యోత్స్నరెడ్డి అన్నారు. విద్యార్థినులు, మహిళలు బ్లాక్‌మెయిల్‌కు గురైతే షీ టీం వాట్సాప్ నెంబర్లు :8712656935, 7901142009లను సంప్రదించాలన్నారు. హెచ్‌ఎం విష్ణువర్దన్, ఉపాధ్యాయులు ఉప్పలయ్య, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, శివరాణి, మల్లారెడ్డి, సతీష్‌కుమార్, తిరుపతి, సోమేశ్వర్, వనజ, ఏఎస్సై ఆనందం, సిబ్బంది అరుణ, పార్వతి, రమేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఉపాధి' పనులు

గూడూరు, ఏప్రిల్ 10 : ఏజెన్సీ మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలోని 39 గ్రామపంచాయతీలు ఉండగా ఏపీవో భక్సీలాల్ నేతృత్వంలో టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌ల పర్యవేక్షణలో గత వారం రోజులుగా పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఎండకాలం కావడంతో వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. ఉపాధిహామీ పనులు జరిగే చోట కూలీలకు తాగునీటిని ఏర్పాటు చేయడంతో పాటు ప్రథమచికిత్స కిట్‌లను అందుబాటులో ఉంచాలని కూలీలు కోరుతున్నారు.

'ఎంపీగా సీతారాంనాయక్‌ను గెలిపించాలి'

ఇనుగుర్తి, ఏప్రిల్ 10 : నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానమంత్రిగా చేసేందుకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీతారాంనాయక్ యువసేన అధ్యక్షుడు బోగ అనిల్ కోరారు. చిన్నముప్పారం శివారు పెద్దతండాలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు, విద్యావేత్త, మాజీ ఎంపీ, సీతారాంనాయక్‌ను అత్యధిక మెజార్టీ గెలిపించాలన్నారు. సీతారాంనాయక్ ఎంపీగా ఉన్నప్పుడు కేంద్రీయ విద్యాలయాలు, పలు రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించేందుకు కృషి చేసినట్లు తెలిపారు. శ్రీనివాస్, సుధాకర్, నరేష్ పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

• మానుకోట ఎంపీ మాలోతు కవిత

మహబూబాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా రంజాన్ పండుగ ఆనందోత్సహాల నడుమ జరుపుకోవాలని మానుకోట ఎంపీ మాలోతు కవిత అన్నారు. రాష్ట్రం, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముస్లీంలందరికి రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త సూచించిన మార్గాన్ని పాటిస్తూ ఎంతో నిష్ఠతో నెల రోజులపాటు సహనం, త్యాగం, జాలి, దయ, సేవాగుణాలను ప్రతీ ఒక్కరు అలవర్చుకుని ఉపవాస దీక్షలు చేశారని పేర్కొన్నారు. మసీదులు, ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనల నడుమ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

'హోమియోపతి వైద్యాన్ని ఉపయోగించుకోవాలి'



మునిసిపల్ కార్మికులకు టీ షర్టులు పంపిణీ చేస్తున్న డాక్టర్ అశోక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్10 : హోమియోపతి వైద్యాన్ని ప్రతీ ఒక్కరు ఉపయోగించుకోవాలని హోమియోపతి మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. మహబూబాబాద్‌లో బుధవారం ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూహోమియోపతి వైద్యంతో అనితర సాధ్యమైన వ్యాధులను నయంచేయవచ్చన్నారు. ప్రపంచంలో అతితక్కువ ఖర్చుతో వ్యాధుల నుంచి శాశ్వతమైన పరిష్కారం చూపించే హోమియోపతి వైద్యాన్ని అందరు ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం మునిసిపల్ కార్మికులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు, టీ షర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూతురు సత్యనారాయణ, చంద్రదేవ్, దైద వెంకన్న, రామచంద్రారావు, సహజ, సంపత్‌కుమార్, సతీష్, యాకూబ్, రాజేందర్, సునీల్, భారతి, జ్యోతి పాల్గొన్నారు.

నేటినుంచి కోదండరామచంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవాలు

గూడూరు, ఏప్రిల్10 : అప్పరాజుపల్లిలో నిర్మించినశ్రీ సీతా లక్ష్మణహన్మంతు సమేత శ్రీకోదండరామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు గురువారం నుంచి 13 వరకు కొనసాగనున్నాయి. 11న విశ్వక్సేనపూజ, అంకురార్పణ, యాగశాలప్రవేశం, మూలమంత్రహోమములు తీర్థప్రసాదవితరణ కార్యక్రమాలు ఉన్నాయని చెప్పారు. 12న ద్వారతోరణ పూజ, మూర్తికుంభ ఆరాధన, సంక్షేప రామాయణ హోమాలు, ప్రాణప్రతిష్ఠ, హోమాలు, నిత్యపూర్ణహంతి, ఫల, పుష్ప, ధాన్య, హారతి, తీర్థప్రసాదాలు ఉంటాయన్నారు. 13న నిత్యహోమాలు, ద్వారతోరణ బలి, ఉదయం 8.30కు స్వస్తిశ్రీ చాంద్రమాన ఉత్తరాయణ వసంతరుతువు పంచమి శనివారం మృగశిర నక్షత్రయుక్త మిథున లగ్నసుమూహూర్తమున శ్రీసీతాలక్ష్మణహనుమత్ సమేత శ్రీకోదండ రామచంద్రస్వామి వారి, గరుడస్తంభయంత్ర, ప్రతిష్ఠాపన, స్వామివారికి ప్రాణప్రతిష్ఠ, ఆలంకరణ, నేత్రోన్మీలనం, దృష్టికుంభ బలిప్రథమ ఆరాధన, హారతి, తీర్థప్రసాదాలు, ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



ఉత్సవానికి సిద్ధమైన కోదండరామచంద్రస్వామి ఆలయం

ఆయిల్‌పామ్, పండ్ల తోటల పెంపకంపై కరపత్రాల ఆవిష్కరణ

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 10 : వేసవిలో అయిల్‌పామ్, పండ్ల తోటలు, కూరగాయలు, మల్బరీ తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రచురించిన అవగాహన కరపత్రాలను జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో విడుదల చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారి జినుగు మరియన్న, జిల్లా వ్యవసాయాధికారి అభిమన్యుడు అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ ఈ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 6844 ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు సాగవుతున్నాయని చెప్పారు. ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు దృష్టిలో ఉంచుకుని కొత్తగా వేసిన ఆయిల్‌పామ్ తోటలను ఎదిగిన తోటల పెరుగుదలను కాపాడుకుంటూ అధికారులు చెప్పిన యాజమాన్య పద్ధతులను రైతులు పాటించాలని కోరారు. అలాగేసాంకేతిక సహకారం కూడా తీసుకుని అధిక దిగుబడి సాధించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 : మహనీయుల ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా కేంద్రంలోని నూకల రాంచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజు అన్నారు. మహబూబాబాద్‌లోని స్థానిక కళాశాలలో బుధవారం జ్యోతిరావుపూలే జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి, డాక్టర్ బీఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జ్యోతిరావుపూలే అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేశారని పేర్కొన్నారు. సత్యశోధక్ సమాజ్‌ను ఏర్పాటు చేసి ప్రజల హక్కుల కోసం పోరాడారని కొనియాడారు. భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త రాజకీయ నేత, సంఘసంస్కర్త అంటరానితనం నిర్మూలన కోసం కృషి చేసిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రామరత్నమాల, మమత, యుగేందర్, బొంద్యాలు, రాజేందర్, సుజిత్‌రెడ్డి, రాంరెడ్డి, నరహరి, శశికాంత్, హత్తిరాం, ఖాసీం, ఉపేందర్, సుమలత, సంతోష్‌కుమార్, వీరు, రవితేజ పాల్గొన్నారు.



కానూరి వర్ధంతి సభలో మాట్లాడుతూ జీవన్

విప్లవ కళారంగ యోధుడు కానూరి వెంకటేశ్వర్‌రావు

• కవి, రచయిత జీవన్

బయ్యారం, ఏప్రిల్ 10 : ప్రజాపోరాటాలను కళారూపాలుగా మలిచి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన విప్లవ కళారంగ యోధుడు కానూరి వెంకటేశ్వర్‌రావు అని ప్రజారచయితల సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, రచయిత జీవన్ అన్నారు. బయ్యారం గడ్డం వెంకట్రామయ్య విజ్ఞన కేంద్రంలో బుధవారం నిర్వహించిన కానూరి వర్ధంతి సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. కానూరి కళల కార్ఖానా లాంటివారని, అనేక రకాలపాటలు రాయడంతో పాటు కళారూపాలు రూపొందించి స్వయంగా ఊరూరా ప్రదర్శించాడని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవర్ధన్, కానూరి కూతురు అరుణ, ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి సి.బాబురావు, ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఊకె పద్మ, తారాచంద్, చారి హరీష్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

డోర్నకల్, ఏప్రిల్ 10 : డోర్నకల్ మండల సర్వసభ్య సమావేశం బుధవారం సాదాసీదాగా కొనసాగింది. ఈ సమావేశంలో తాగునీటి ఎద్దడిఉన్న తండాలు, గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు అధికారులు యాక్షన్ రూపొందించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మండలంలో తొలుత తాగునీటిఎద్దడి ఎక్కువగా ఉన్న తండాలను గుర్తించి ఆరుబోర్లు వేయించామని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అరుణ చెప్పారు. బోర్లువేసే విషయంపై తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ఎంపీపీ బాలునాయక్ సభ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, అందుకోసమే ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వలేదని ఏఈ అరుణ వివరణ ఇచ్చారు. వివిధ శాఖల నివేదికలను ప్రవేశపెట్టారు.

దైద వెంకన్నకు సన్మానం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 10 : ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హరితమిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్నను బుధవారం ఘనంగా సత్కరించారు. ఆరోగ్యమిత్ర వ్యవస్థాపకులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో వెంకన్నను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సత్యనారాయణ, చంద్రదేవ్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రాంచందర్‌రావు పాల్గొన్నారు.

'పనులను పూర్తి చేయాలి'

కొత్తగూడ, ఏప్రిల్ 10 : మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల మరమ్మత్తు పనులను జూన్ వరకు నాణ్యతతో పూర్తి చేయాలని ఎంపీడీవో రవీంద్రప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలోని 24పాఠశాలలకు సుమారు రూ. 94.60 లక్షల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఛైర్మన్, మహిళ సమాఖ్య సంఘం (వీవో) అధ్యక్షురాలు, ప్రధానోపాధ్యాయులు పనులను నాణ్యతగా చేపట్టేలా పర్యవేక్షించాలన్నారు. పనులకు మంజూరయిన నిధులు సరిపోని పాఠశాలలు మండల విద్యాశాఖ ద్వారా వివరాలు అందిస్తే ఉన్నతాధికారులకు పంపిస్తామని పేర్కొన్నారు. ఎంఈవో శ్రీదేవి, ఎంఎస్‌వో గుమ్మడి లక్ష్మీనారాయణ, ఏపీఎం గుళ్లపల్లి శ్రీనివాస్, ఏఈ రవి, ఆర్పీ రవి, సీఆర్పీలు ఉపేందర్, వెంకన్న, ఉపాధిహామీ సీసీలు వీరాస్వామి, సారంగపాణి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో రవీంద్రప్రసాద్


మార్కెట్‌కు 16 వేల మొక్కజొన్న బస్తాల రాక

కేసముద్రం, ఏప్రిల్ 10 : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం భారీగా మొక్కజొన్నల రాబడులు కొనసాగాయి. మార్కెట్‌కు 230 మంది రైతులు 16,288 బస్తాల్లో 10,587 క్వింటాళ్ల మొక్కజొన్నలు తీసుకురాగా ఎలక్ట్రానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్ (ఈ-నామ్) విధానంలోని ఈ-వేలంలో క్వింటాకు గరిష్ఠంగా రూ.2217, కనిష్ఠంగా రూ.2069, సగటున రూ.2156 ధరల చొప్పున ఖరీదులు చేశారు. గత ఐదు రోజులుగా మార్కెట్‌కు సెలవులు ఉండడంతో మొక్కజొన్నలను భారీగా విక్రయించేందుకు తీసుకువచ్చారు. మధ్యాహ్నమే కాంటాలు ప్రారంభించి రాత్రి వరకు సరుకు అంతటిని కాంటాలు పూర్తి చేశార

'ఆదివాసీ ఐక్య అభ్యర్థిని నిలపాలి'

కొత్తగూడ, ఏప్రిల్ 10 : ఆదివాసీల అస్థిత్వాన్ని కాపాడుకోవాలంటే మానుకోట పార్లమెంట్ స్థానంలో ఆదివాసీ ఐక్య అభ్యర్థిని ఎన్నికల్లో నిలపాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూర్క యాదగిరి పేర్కొన్నారు. కొత్తగూడలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానుకోట పార్లమెంట్ స్థానంలో అన్నిరాజకీయ పార్టీలు ఆదివాసీ జాతికి అన్యాయం చేశారని ఆరోపించారు. ఆదివాసీ ఐక్య అభ్యర్థిని ఎన్నికల్లో నిలిపే యోచనలో భాగంగా ఈనెల 11న (నేడు) ఏటూర్‌నాగారంలో నిర్వహిస్తున్న ఆదివాసీ సంఘాల జేఏసీ, అఖిలపక్ష రాజకీయ, ప్రజాసంఘాల జేఏసీ సమావేశంను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పూనెం సందీప్, మల్లెల సారయ్య, ఈక నరేష్, ఈక సత్యం పాల్గొన్నారు.

ముగిసిన కొండలమ్మ జాతర ఉత్సవాలు



కొండలమ్మ జాతరలో కనిపించిన తాచుపాము

గార్ల, ఏప్రిల్ 10 : పినిరెడ్డిగూడెం సమీపంలోని కొండలమ్మ దేవాలయంలో ఉగాది పర్వదిన రోజున భక్తులకు జాతరలో తాచు పాములు దర్శనం ఇచ్చాయి. ఏటా ఉగాది పండుగ సందర్భంగా నాలుగురోజుల పాటు కొండలమ్మ జాతర బ్రహ్మోత్సలు నిర్వహించడం అనవాయితీ. ఈ ఉత్సవాల్లో భాగంగా పలుజిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి, కొండలమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది రోజున కొండలమ్మ, గారెమ్మ, గాయమ్మ దేవతలకు ఉత్సవాలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుంటారు. ఈ సమయంలో మూడుపాముల రూపంలో దేవతలు దర్శనమివ్వడం ఏటా జరుగుంతుందని భక్తుల నమ్మకం. ఈనాగ సర్పములకు పూజలు చేస్తే, పాపాలు తొలగి పోతాయని భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు. జాతరలో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీతోపాటు గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు. అవాంచనీయ సంఘటనలు జరుగకుండా గార్ల, బయ్యారం సీఐ బి.రవికుమార్, ఎస్సై జీనత్‌కుమార్ నేతృత్వంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

'ప్రజల్లో అవగాహన పెంచాలి'

కురవి, ఏప్రిల్ 10 : మరణానంతరం శరీరాన్ని మెడికల్ కళాశాలకు దానం చేయడం ద్వారా వైద్య విద్యార్థుల అభ్యసనానికి ఉపయోగపడుతుందని తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతలసంఘం జిల్లా కన్వీనర్ రవీందర్‌రెడ్డి అన్నారు. కురవికి చెందిన పెండెం బచ్చమ్మ మరణానంతరం తన మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు ఇచ్చేందుకు రవీందర్‌రెడ్డికి బుధవారం ఆంగీకార పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరణానంతరం నేత్రాలు, శరీరం, బ్రెయిన్‌డెత్ అయినవారి అవయవాలు దానం చేసేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని, బచమ్మను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు శరీరదానానికి ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ఎర్ర నాగేశ్వర్‌రావు, రిటైర్డ్ ఉద్యోగి బాదె వెంకన్న, దాత కుటుంబసభ్యులు గుంటి శశిరేఖ, సురేష్, శ్రీహరి, గజ్జెల కల్యాణ్, కిరణ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్‌ల పంపిణీ

కురవి, ఏప్రిల్ 10 : నడవలేని స్థితిలో ఉన్న 14 మంది దివ్యాంగులకు ఐసీఎం సంస్థ బుధవారం వీల్‌చైర్‌లను పంపిణీ చేసింది. కురవి మండలం మొగిలిచర్లలో ఈ వీల్‌చైర్‌లను దివ్యాంగులకు అందించారు. ఐసీఎం డిస్ట్రిక్ లీడర్ బి.సేవ్యనాయక్ దివ్యాంగులకు వీల్‌చైర్‌లను అందించారు. కురవి, డోర్నకల్, సీరోలు మండలాల నాయకులు ఎంటి తేళ్ల ఏలియా, మండల ఐసీఎం ఎన్ఎం నక్క గణేష్, ఏసుపాదం, పత్తిపాల్, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు డాక్టర్ జాఫర్‌ఖాన్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గన్‌గోర్ వేడుకలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్10 : జిల్లా కేంద్రంలోని కొత్త బజార్ మార్వాడీ సఖీమండలి ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గన్‌గోర్ (బతుకమ్మ) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏటా గన్‌గోర్ పర్వదిన వేడుకల నిర్వహణలో భాగంగా మార్వాడీ మహిళలు భర్తలు ఆయురారోగ్యాలు కలిగియుండాలని, పెళ్లి కాని యువతులకు సద్గుణాలు కలిగిన యువకుడు భర్తగారావాలని శివపార్వతులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మార్వాడీ సత్రంలో శివపార్వతుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మార్వాడీ మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బ్యాండ్ మేళాల నడుమ శివపార్వతుల విగ్రహాలను నెత్తిమీద పెట్టుకొని పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

'ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 10 : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని స్వీప్ నోడల్ అధికారి జినుగు మరియన్న అన్నారు. మహబూబాబాద్ మోడల్ స్కూల్‌లో బుధవారం ఓటు నమోదు, ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు పొందిన ప్రతీ ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ అమరావతి, ఉపాధ్యాయులు సతీష్, ప్రవీణ్‌కుమార్, సుల్తానా, స్వీప్ సిబ్బంది శ్రామ్, అశోక్, పాల్, బిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలి

తొర్రూరు, ఏప్రిల్ 10 : మునిసిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఐఎఫ్‌టీయూ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం కార్మికులకు వసతులు కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని మునిసిపల్ మేనేజర్ కట్ట స్వామికి వినతిపత్రం అందించి ఆయన మాట్లాడారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు తీవ్రంగా ఉన్నాయని, మునిసిపల్ అధికారులు కార్మికుల బాగోగులు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పని ప్రదేశాల్లో ఎలాంటి వసతులు లేవన్నారు. పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులకు గ్లౌజ్‌లు, ఓఆర్ఎస్ ప్యాకెట్‌లు, అరటి పండ్లు, కొబ్బరి నూనె లాంటివి అందించాలని, కార్మికుల పనివేళల్లో మార్పు చేయాలన్నారు. మునిసిపల్ కార్మికులు మహేందర్, ప్రసాద్, నవీన్, మోహన్, నర్సమ్మ పాల్గొన్నారు.

'స్కూళ్లలో వసతుల నిర్వహణ కమిటీలదే'

మరిపెడ, ఏప్రిల్ 10 : ప్రభుత్వ పాఠశాలల వసతుల నిర్వహణ అమ్మ ఆదర్శ కమిటీలదేనని ఎంపీడీవో రేవతి అన్నారు. బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల బాధ్యులకు ఓరియేంటేషన్ శిక్షణనుమండల్ పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడారు. మే 10వ తేదీలోపు అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన 28 పాఠశాలల్లో మౌలిక వసతుల నిర్వహణ బాధ్యత అమ్మ ఆదర్శ కమిటీలు చూసుకోవాలన్నారు. ఎంఎస్‌వో అనితాదేవి, డీఆర్‌పీఎం రామ్మూర్తి, ఏపీఎం రాములు, ఆర్అండ్‌బీ ఏఈ శివకుమార్ పాల్గొన్నారు.

ఉగ్గంపల్లి రోడ్డుపై పట్టింపేదీ?

చిన్నగూడూరు, ఏప్రిల్ 10 : అధికారుల ఉదాసీనత, పాలకుల నిర్లక్ష్యం, ప్రభుత్వ శాఖల సమన్వయలోపం వెరసీ రెండేళ్ల క్రితం ఉగ్గంపల్లి రోడ్డుపై కంకర వేసి పట్టింపులేక వదిలేశారని పౌర మానవ హక్కుల సంస్థ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ రాంచందర్‌నాయక్ మండిపడ్డారు. బుధవారం ఉగ్గంపల్లి గ్రామస్థులు కంకర వేసిన రోడ్డుపై మోకాలిపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. వీరాచారి, బుచ్చిమల్లు, రమేష్, బిందు, యాకయ్య కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

వరంగల్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్



తొర్రూరు సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేష్

తొర్రూరు, ఏప్రిల్ 10 : దేశం సుభిక్షంగా, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటే మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలని, ఆయన ఆశీస్సులతో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని బీజేపీ వరంగల్ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో పెద్దవంగర, రాయపర్తి, తొర్రూరు అర్బన్, రూరల్ మండలాల పార్టీ కార్యకర్తలు బూత్‌స్థాయి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. తొర్రూరు, రాయపర్తి మండలాలకు చెందిన కొందరు నాయకులు బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, వన్నాల శ్రీరాములు, టి.రాజేశ్వర్‌రావు, లేగ రాంమోహన్‌రెడ్డి, వై.వి.రావు, మురళీధర్‌గౌడ్, కుమారస్వామి, పల్లె కుమార్, పూసల శ్రీమాన్, ఆర్.కుమార్, రవిబాబు, పులేందర్, నవీన్, రాజేష్, యాకయ్య, శేఖర్ పాల్గొన్నారు.

మామిడి చేతికి వచ్చేనా..?!

(5వ పేజీ తరువాయి)

రాలడంతో పాటు చెట్టు కొమ్మలు ఎండిపోతున్నాయని, వాటికి నివారణ చర్యలు చేపడుతూ, జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానవన అధికారులు వెల్లడిస్తున్నారు. కాయనుసంరక్షించడానికి ఫ్రూట్‌ప్రొటక్షన్ బ్యాగులను కట్టడంతో కాయకు దెబ్బలు, మచ్చలు లేకుండా నాణ్యతతో వస్తుంది. తేనె మంచు నివారణకు ఫాస్మోమిడాన్ 05.మి.లీ, ప్రోఫినోపాస్ 1.5మి.లీ, క్లోరిపిరిపాస్ 2.5మి.లీ, థయోమిథాక్సమ్ 0.3 గ్రా. ప్లానోఫిక్స్ 1.0మి.లీ చొప్పున 4.5లీటర్ల నీటిలో కలిపి పిచ్చికారి చేయాలి. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో పిందె రాలకుండా 15 రోజులకు ఒక్కసారి నీటి తడులివ్వడంతో కాయ, పిందె రాలకుండా నివారించవచ్చు.

అధిక ఉష్ణోగ్రతలే కారణం

- రాకేష్, ఉద్యానవన అధికారి, తొర్రూరు



మామిడి తోటలపై అధిక ఉష్ణోగ్రతల ప్రభావం అధికంగా పడుతోంది. దీంతో కాసిన కాయ రాలిపోతుంది. పూత విరబూసినప్పటికీ వాతావరణ మార్పులతో తేనె మంచుతో పూత రాలిపోవడం, ఆకులు నల్లబడటం జరుగుతోంది. రైతులు ఎప్పటికప్పుడు నీటిని అధికంగా అందించడంతో కాయ రాలకుండా అరికట్టవచ్చు. రైతులు ఎప్పటికప్పుడు సస్య రక్షణ చర్యలు చేపడుతూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఈసారి దిగుబడి ఎకరాకు ఒక టన్ను వరకు మాత్రమే వచ్చే అవకాశం ఉంది.